క్లుప్తంగా

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



జగ్గయ్యపేట అర్బన్: మెప్మాలో రిసోర్స్ పర్స న్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు ఆర్పీలు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు, ప్రభుత్వానికి మధ్య వార ధిగా ఉంటూ ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుం చి వచ్చే సంక్షేమ పథకాలను, లోన్‌లను డ్వాక్రా గ్రూపులకు తెలియజేస్తూ వారికి మార్గదర్శిగా ఉంటున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆర్పీల సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే తాతయ్య ప్రభుత్వం దృష్టికి తీసుకువె ళతానని వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా సబారీ ఊరేగింపు



ముక్త్యాల(జగ్గయ్యపేట): మొహర్రం పండుగ సందర్భంగా గ్రామంలోని ముస్లింలు సబారీ (పీర్లు) ఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పీర్ల చావిడి నుం చి సబారీలను డప్పు వాయిద్యాలతో గ్రామం లో ఊరేగించారు. కులమతాలకు అతీతంగా సబారీలకు వార్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



జగ్గయ్యపేట అర్బన్: విజయవాడ బార్ అసోసి యేషన్‌కు చెందిన న్యాయవాది గోటిక శివకృ ష్ణారెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు కోర్టు విధు లను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు మాట్లాడుతూ తక్షణ మే న్యాయవాదుల రక్షణ చట్టంను అమలు చేయాల్సిన ఆవశ్యకతను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, కరణం నరసింహా రావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, శ్యామల నరసింహారెడ్డి, జి.లక్ష్మీనారాయణ, ఎం.కృష్ణయ్య, ఎం.ఆంజనేయులు, పూల నాగ రాజు, శ్రీనివాసగౌడ్, కె.శ్రీనివాసగౌడ్, ఆర్.ప్ర సాద్, బిక్షమయ్య, ఆదినారాయణ, శ్రీధర్ తది తరులు పాల్గొన్నారు.

సీయోను ప్రార్థనా మందిర వార్షికోత్సవం



కంచికచర్ల: నందిగామ పట్టణంలోని డీవీఆర్ కాలనీలో వాయిస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ సీయోను ప్రార్థనా మందిరంలో మంగళవారం 15వ వార్షికోత్సవ ఆరాధన కార్యక్రమం జరి గింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ ఏసు ప్రభువును నమ్మిన వారికి ఏ చింత ఉండదని, క్రీస్తు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ సందర్భం గా పలువురు గాయకులు క్రీస్తు సన్నుతిగీతాలు ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే సౌమ్యను సంఘ నాయకులు శాలువాతో సత్కరించారు. సంఘస్తులు, విశ్వాసులు ప్రేమ విందు చేశారు. కార్యక్రమంలో సంఘ చైర్మన్ గురివిం దపల్లి ప్రసాదరావు, పాస్టర్లు రాజు, సురేష్, శాంతి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ త్రోబాల్ పోటీలకు విజయవాడ విద్యార్థిని



లబ్బీపేట(విజయవాడ తూర్పు): బెంగుళూరులో ఆగస్టు 3 నుంచి 7 వరకూ జరగనున్న 16వ సౌత్ జోన్ నేషనల్ త్రోబాల్ పోటీలకు నలంద విద్యా నికేతన్ విద్యార్థిని దిషా రాతి ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడి యంలో జరిగిన నేషనల్ ప్రాబెల్స్ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 160 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. తమ పాఠశాలలో 12వ తరగతి విద్యార్థిని దిషా రాతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

సమస్యల లోగిళ్లు

పెనుగంచిప్రోలు మండలంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు ఎవరికీ పట్టని అనా థల్లా తయారయ్యాయి. పెనుగంచిప్రోలు ఎస్సీ బాలుర వసతిగృహంలో గత రెండేళ్లుగా అసలు అడ్మిషన్లే లేవంటే అది ఎలాంటి దయ నీయ స్థితిలో ఉందో తేటతెల్లమవుతోంది. కొణకంచి బాలికల వసతిగృహం ఊరికి 2 కి.మీ దూరంలో ఉండటంతో అక్కడ చేరడా నికి ఎవరూ సుముఖత చూపడం లేదు. మిగిలిన వసతిగృహాలు కూడా సమస్యల సాలెగూట్లో చిక్కి కునారిల్లుతున్నాయి.



శిథిలావస్థలో పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం

- కునారిల్లుతున్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలు
- గత రెండేళ్లుగా అడ్మిషన్లు లేని పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహం
- ఊరికి దూరంగా కొణకంచి బాలికల వసతి గృహం

పెనుగంచిప్రోలు: మండలంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు అనేక సమస్యలతో కునారిల్లు తున్నాయి. దీంతో విద్యార్థులు ఎవరూ వీటిలో చేరేం దుకు ఇష్టపడటం లేదు. మండల కేంద్రం పెనుగంచి ప్రోలులో ఎస్సీ(బాలుర)వసతి గృహం ఉంది. మం డలంలోని కొణకంచి గ్రామంలో ఎస్సీ(బాలికల) వసతి గృహం ఉంది. గతంలో పెనుగంచిప్రోలు వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉంది. 70 నుం చి 100 మంది వరకు వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉండేవారు. 3 నుంచి 8 తరగతుల విద్యా ర్థులను ఇక్కడ చేర్చుకునేవారు. రానురాను వసతి గృ హంలో సమస్యలు పెరగటంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. గత ఏడాది నుంచి అడ్మిషన్లు కూడా లేని పరిస్థితి ఉంది. కానీ వార్డెన్‌తో పాటు సిబ్బంది మాత్రం కొనసాగుతుండటం గమనార్హం.

పూర్తిగా శిథిలమైన భవనం

వసతి గృహం భవనం 12 గదులు శ్లాబ్‌లు ఊడిపోయి శిథిలావస్థలో ఉన్నాయి. వంటశాల భవనం బాగానే ఉంది. బోరు లేకపోవటంతో నీటి సమస్య ప్రధానంగా ఉంది. టాయిలెట్స్, ఎలక్ట్రిఫి కేషన్ మరమ్మతులు చేయాల్సి ఉంది. తక్షణం వీటిని చేస్తే విద్యార్థులు చేరే అవకాశం ఉంది.

గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో వసతి గృహం

కొణకంచి జగనన్న కాలనీలో ఉన్న బాలికల వసతి గృహం నుంచి గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు 2 కిలోమీటర్ల దూరం ఉంది. దీంతో విద్యార్థులు అక్కడి నుంచి నడిచి పాఠశాలకు వెళ్లలేక వసతి గృ హంలో చేరేందుకు సుముఖత చూపటం లేదు. 3 నుంచి 8 తరగతులకు ప్రస్తుతం 15 మంది విద్యా ర్థులు ఉన్నారు. ఇక్కడ భవనం, ఇతర నిర్మాణాలు బాగానే ఉన్నా దూరం కావటంతో విద్యార్థుల సం ఖ్య తక్కువగా ఉంది.

మరమ్మతులు చేయిస్తాం

–గణేష్‌బాబు, ఏఎస్‌డబ్ల్యూఓ, జగ్గయ్యపేట

పెనుగంచిప్రోలు బాలుర వసతి గృహాన్ని ఇటీవ లన డీడీ పరిశీలించారు. మరమ్మతులు చేయిం చటంతో పాటు వంటశాల భవనాన్ని ప్రస్తుతం విద్యార్థులు ఉండేందుకు సిద్ధం చేయమన్నారు. బోరు ఏర్పాటు, ఇతర మరమ్మతుల గురించి ఎం పీపీ మార్కపూడి గాంధీ అధికారుల దృష్టికి తీసుకె ళ్లగా మరమ్మతులు చేయిస్తామన్నారు. వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కొణకంచి వసతి గృహం వద్ద నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులను బస్సు సర్వీసు నడిపేలా చూడమని కోరాం.



గ్రామానికి దూరంగా ఉన్న కొణకంచి బాలికల వసతి గృహం

తక్షణం ప్రారంభించాలి

గత ఏడాది నుంచి వసతి గృహం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. వసతి గృహానికి విశాలమైన స్థలం, చుట్టూ ప్రహరీ ఉంది. ఎస్సీ బాలుర వసతి గృహాన్ని తక్షణం మరమ్మతులు చేయించి ప్రారంభించాలి.



–గుజ్జర్లపూడి వడ్డీకాసులు, ఎస్సీ నాయకుడు

దూరం కావటంతోనే ఇబ్బంది

గ్రామంలోని బాలికల వసతి గృహం పాఠశాలకు దూరం కావటంతోనే విద్యార్థుల సంఖ్య తక్కు వగా ఉంటోంది. విద్యార్థులకు ప్రభుత్వాలు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాయి. విద్యార్థుల సం ఖ్య పెరిగేందుకు త్వరలో చర్యలు చేపడతాం.



–గోసెల దేవి, సర్పంచ్, కొణకంచి

మిక్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాపు

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో గత రెండు రోజుల నుంచి డ్రోన్ టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్స్ అంశంపై వర్క్ షాప్ మంగళవారంతో ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. వర్క్ షాపులో డ్రోన్ ఐఓటీ ఇంటిగ్రేషన్, ఏఐ పవర్ డ్రోన్స్, డ్రోన్ ఏరో డైనమిక్స్, కాలిబ్రేషన్స్, అసెంబ్లింగ్, లైవ్ స్ట్రీమింగ్ తదితర అంశాలపై ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సమీర్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. డ్రోన్ ఫ్లైయింగ్‌పై విద్యార్థు లకు అవగాహన కల్పించి వాటి ఉపయోగాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఇటువంటి శిక్షణల ద్వారా ఐఓటీ టెక్నాలజీ రంగంలో ఉపాధి అవ కాశాలు మరెన్నో అందిపుచ్చుకోవచ్చని తెలి పారు. విద్యార్థులు అధునాతన సాంకేతిక రంగాల్లో జరుగుతున్న మార్పులను తెలుసు కుంటూ ఎప్పటికప్పుడు ఆ విషయాలపై పట్టు సాధిస్తే విజయం తథ్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకిరణ్ అన్నారు. కార్యక్రమంలో కళా శాల సీఈఓ డి.పాండురంగారావు, మేనేజ్‌మెంట్ సభ్యులు ఎం.సుహాస్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ పుల్లారావు, అధ్యాపకులు, విద్యా ర్థులు పాల్గొన్నారు.



కంచికచర్ల మిక్ కళాశాలలో జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

అలసత్వం వహిస్తే చర్యలు

జుజ్జూరు(వీరులపాడు): విధి నిర్వహణలో అల సత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎం ఈవో పాల్ కెనడి హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికో న్నత పాఠశాల (మెయిన్‌ను) మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఉపా ధ్యాయులు విద్యార్థులకు అర్థమ య్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాల న్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథక నిర్వ హణను ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచిం చారు. విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించేలా చూడాలని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి పథక నిర్వాహకులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు అదృశ్యం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మండలం రావి రాల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న సాంబశివ రావు కనిపించడం లేదంటూ ఆయన భార్య అనూష పట్టణ మంగళవారం రాత్రి పోలీస్‌స్టే షన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు అనూష తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 7న తన భర్త సాంబశివరావు స్నేహితుని ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడని, రాత్రి వరకు రాకపో వడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినప్ప టికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పట్టణ ఎస్‌ఐ సూర్యభగవాన్ తెలిపారు.

అధ్వానంగా ఆర్ అండ్ బీ రహదారులు

- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

వీరులపాడు: మండలంలోని మేజర్ గ్రామ పం చాయతీలలో సైతం రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఏ గ్రామానికెళ్లినా పూర్తిగా ధ్వంసమైన రహదారులపై వరద నీరు చేరి రహదారిపై ఉన్న గుంతలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని జమ్మవరం నుంచి వీరులపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమా దాలకు నిలయంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న మోకాలులోతు గుంతల్లోకి వరద నీరు చేరి ప్రయాణికులకు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఈ రహదారి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేసే రహదారి కావటం తో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపో కలు సాగిస్తుంటాయి. వీరులపాడులోని ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు సమీప గ్రామాల నుంచి ప్రజలు వీరులపాడుకు వస్తుం టారు. గోతుల రహదారిలో రాకపోకలు సాగిం చాలంటే ప్రాణాలమీదకు వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాలలో నీటితో నిండి ఉన్న గుంతలను గమనించక ప్రమా దాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలుగా లేవని, అయినా అధికారులు పట్టించుకో వటం లేదని ఆరోపిస్తున్నారు. రహదారిపై ఉన్న గుంతలను తక్షణమే పూడ్చి మరమ్మతులు నిర్వ హించాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపో యిందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికా రులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వరద నీటితో చెరువును తలపిస్తున్న జమ్మవరం-వీరులపాడు ప్రధాన రహదారి

నైపుణ్యాల పెంపుతో ఉద్యోగావకాశాలు

మైలవరం: యువతలో నైపుణ్యాల పెంపుతో ఉద్యో గావకాశాలు మెరుగుపడతాయని ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు అన్నారు. మైలవరం లకి రెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా కళాశాల ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అధ్యాప కులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. నాగాంజనేయులు వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న జాబ్ మార్కెట్, సరైన నైపుణ్యాలతో యువతకు సాధికారత కల్పించడం, ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్‌కు వివిధ రకాల కోర్సులను నేర్చుకో వటం ద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడ తాయని చెప్పారు. డిజిటల్ యుగం నేటి యువ తకు అద్భుతమైన అవకాశాలను అందిస్తోందని, యువత ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఎలా ఉండాలనే విషయాలను వివరించారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



మునగచర్ల నుంచి దుర్గాదేవికి సారె సమర్పించేందుకు తరలివెళుతున్న భక్తులు, పాల్గొన్న ఎమ్మెల్యే సౌమ్య

కంచికచర్ల: నందిగామ మండలం మునగచర్లలో ఆషాఢమాసం సందర్భంగా మంగళవారం ఆల యంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, పుష్పాలు, వస్త్రాలు, చలిమిడి, పండ్లతోపాటు ఇతర సుమంగళ ద్రవ్యాలు, పదార్థా లను తీసుకుని మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గాదేవికి సారెను సమర్పించేందుకు తరలివె ళ్లారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సం ఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ ఏసీ శాంతిపై అభాండాలు వేయడం దారుణం

జగ్గయ్యపేట అర్బన్: దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై నిందారోపణలు చేస్తూ ఆమె మనోభావాల్ని కృంగదీసే విధంగా వ్యవహరిం చడం దారుణం అని వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి, గోర్‌బాయి సేవాసంఘం నియోజ కవర్గ అధ్యక్షుడు లాహోరి బద్దూనాయక్ మంగళ వారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇది ఉద్దేశపూ ర్వకంగా ఆమె వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రూ.15 వేల నగదు అపహరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఓ వృద్ధురాలికి చెందిన రూ. 15వేల నగదును అపహరణకు గురైన ఘటన దుర్గగుడిపై చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కేరళకు చెందిన వరలక్ష్మి.. అమ్మవారిని దర్శించుకునేందుకు మంగళ వారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆమె చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో మహా మండపం వద్ద సిబ్బంది అడ్డుకున్నారు.సెల్‌ఫోన్‌ను కౌంటర్‌లో పెట్టాలని చెప్పడంతో వరలక్ష్మి క్యూలోకి వెళ్లారు. చేతిలో ఉన్న సం చితో ప్లాస్టిక్ కవరును పట్టుకుని ఉన్నారు. క్యూ ముందుకు కదిలే క్రమంలో ఆమె చేతిలో కవరు జారిపోయింది. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆ కవరు తీసుకుని వెళ్లిపోయినట్లు వరలక్ష్మి చెబుతున్నారు. ఆ కవరులో తన భర్త పెరుమాళ్ ఆపరేషన్ కోసం గన్నవరంలో ఉన్న తన తమ్ముడు నారాయణ ఇచ్చిన రూ.15 వేలు ఉన్నాయని ఆమె తెలి పారు. వరలక్ష్మి కన్నీటి పర్యంతం కావడంతో అక్కడి సిబ్బంది మహా మండపం ఏడో అంతస్తులోని పోలీస్ అవుట్‌పోస్ట్‌కు తీసుకెళ్లారు. పోలీసు సిబ్బంది సీసీ కెమెరాలో పుటేజీ చూసి నిందితుడిని గుర్తించే దుకు ప్రయత్నిస్తున్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధికి పూర్తి సహకారం

ఎంపీపీ షేక్ మలక్‌బషీర్

కంచికచర్ల: మండలంలోని అన్ని గ్రామాల అభివృ ద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమా వేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వంలో మండలాన్ని ఆదర్శ మం డలంగా తీర్చిదిద్దామన్నారు. గ్రామాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎంపీడీఓ అత్తోట దీప్తి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, సం క్షేమం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈనెల 18న నందిగామలో నియోజకవర్గంలోని అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనా థ్(చిన్ని) సమావేశం నిర్వహించనున్నారని, ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలను తయారు చేసుకుని సమావేశానికి హాజరుకావాలన్నారు. ఎం ఈఓ బి.బాలాజీ మాట్లాడుతూ మండలంలో అన్ని పాఠశాలలకు విద్యా కానుక అందజేశామని అన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని మిగిలిన కొన్ని పను లను త్వరలో పూర్తిచేస్తామన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో 89 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్ మాట్లాడుతూ, ఇప్పటికే రైతులకు 50 శాతం రాయి తీపై పిల్లి పెసర, జీలుగ విత్తనాలు పంపిణీ చేశామ న్నారు. మండలంలో 6,150మంది కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు. డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం కోట భాస్కరరావు మాట్లాడుతూ వైఎ స్సార్ ఆసరా పథకం ద్వారా 4,344 సంఘాలకు రూ.53.66 కోట్లు గత ప్రభుత్వం పంపిణీ చేసిం దన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.4.49 కోట్లు ఇచ్చామన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు చేప ట్టామని ఏపీఓ రమాదేవి తెలిపారు.



మండల పరిషత్ సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మలక్‌బషీర్

పనిచేయకుండానే మస్టర్లు

సమావేశంలో కొంతమంది ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో మేట్‌లతో కుమ్మక్కై కొం దరు ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయని జాబ్‌కార్డుదారు లకు మస్టర్లు వేస్తున్నారని ఆరోపించారు. వారికి పని దినాలకు వచ్చిన నగదును కూలీల నుంచి సగం తీసుకుంటున్నారని చెప్పారు. విచారించి వారిపై చర్యలు తీసుకుంటామని ఏపీఓ చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా మండలం లోని కొన్ని గ్రామాల్లో పనులు చేశామని ఇంకా 93 పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రతి నెల రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, శుభ్రం చేసిన తేదీని ఓహెచ్‌ఆర్‌పై వేయాలన్నారు. బ్లీచింగ్ కూడా సరఫరా అయ్యే తాగునీటిలో వేయా లన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీలు బండి మల్లికార్జు నరావు, వెలగలేటి మాధవి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికా రులు పాల్గొన్నారు .

అద్దె బస్సులను తరలించే ప్రక్రియ నిలిపివేయాలి

ఎమ్మెల్యే తాతయ్యకు డిపో యూనియన్ల నేతల వినతి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో నుం చి బస్సులను విజయవాడ డిపోకు బదిలీ చేయాలని మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాన్ని వెం టనే విరమించుకోవాలని పేట ఆర్టీసీ డిపో యూని యన్ల నేతలు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట డిపోకు చెందిన పలు యూనియన్ల ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాత య్య)ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట డిపోకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న జగ్గయ్యపేట-విజ యవాడ రూట్‌లో ప్రస్తుతం 25 అద్దె బస్సులు తిరు గుతున్నాయని, వాటిలో సుమారు 10 అద్దె బస్సు లు కేవలం అద్దె బస్సుల యజమానుల సౌలభ్యం కోసం విజయవాడ డిపోకు బదిలీ చేస్తున్నారని తెలి పారు. దీనివలన జగ్గయ్యపేట డిపోకు రోజుకు సుమారు రూ.3 లక్షల ఆదాయం తగ్గిపోతుం దన్నారు. సుమారు 30 మందికి పైగా ఉద్యోగులు బదిలీ అయ్యే అవకాశం ఉందన్నారు. భవిష్యత్‌లో పేట డిపో మినీ డిపోగా మారిపోయి నష్టాల పేరుతో మూసివేసే పరిస్థితి కూడా వస్తుందని తెలిపారు. ఆదాయం రావటం లేదనే నెపంతో రాత్రిపూట శ్రీశైలం బస్సును కూడా రద్దు చేశార న్నారు. డిపోను నష్టపరిచే విధంగా యాజమాన్యం తీసుకునే చర్యలను వెంటనే నిలుపుదల చేసే విధం గా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్ఎం యూ తదితర యూనియన్ల ప్రతినిధులు పాల్గొ న్నారు.



ఎమ్మెల్యే తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న పేట ఆర్టీసీ డిపో యూనియన్ల ప్రతినిధులు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని

కంచికచర్ల: ప్రజలకు డోర్ టు డోర్ తడి చెత్త, పొడి చెత్త సేకరణ గురించి అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. నందిగామ పురపాలక సంఘ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. పరిశుభ్రత పరిర క్షణలో ప్రజలను భాగస్వాములను చేయాలని పిలు పునిచ్చారు. రోడ్లు, వీధులు, డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. పారి శుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీల్లో పేరుకపోయిన చెత్తా చెదారాన్ని పూడిక తీయటం, ఫాగింగ్ చేయటం, దోమలు, కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలందరూ తమ తమ పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. ఏఎ న్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఆయా సచివాలయాల పరిధిలో ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవా రం నిర్వహిస్తూ తద్వారా డెంగీ, మలేరియా, డయే రియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కాచి వడపోసిన నీరు తాగాలన్నారు. స మావేశంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫణి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచి వాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హేమమాలిని

ఇంద్రకీలాద్రిపై మౌలిక వసతుల సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వ రస్వామి వార్ల దేవస్థానం భక్తులకు కల్పిస్తున్న మౌలిక వసతులపై మంగళవారం సమీక్ష సమా వేశం జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహామండపం నాలుగో అంతస్తులోని ఈవో చాం బర్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఈవో కె.ఎస్. రామరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి విచ్చేశారు. దేవస్థాన మాస్టర్ ప్లాన్‌తో పాటు ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. క్యూ కాంప్లెక్స్, అన్నదానం, ప్రసాదాల పోటు పను లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆలయ ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. అమ్మవారి భక్తులను తీవ్రంగా వేధిస్తున్న పార్కింగ్ సమస్యపై చర్చించారు. ఆలయ అధికారులు పలు సూచనలు చేయగా, ఆయా ప్రభుత్వ శాఖలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమ, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్లను ఎమ్మెల్యే సుజనా చౌదరి దర్శించుకున్నారు.



సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఈవో రామరావు